క్లుప్తంగా

వారపు సంతలో భోజనం వితరణ



భోజనాలు వడ్డిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పాకాల : స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌ సమీపంలోని వారపు సంతలో సోమవారం చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి సొంత నిధులతో రైతులు, వ్యాపారులు భోజనం వితరణ చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో జరిగే వారపు సంతల్లో భోజనం వితరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్‌ సీపీ నాయకులు తెలిపారు. రైతులు, వ్యాపారులు మాట్లాడుతూ తమ కష్టాలను గుర్తించి ఆకలి తీర్చిన ఎమ్మెల్యే కుటుంబానికి రుణపడి ఉంటామని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కూడా వైఎస్సార్‌ సీపీ మద్దతుగా నిలిచి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుంటామని పేర్కొన్నారు.

బిజినెస్‌ ఎక్స్‌పో–2023 బ్రోచర్స్‌ ఆవిష్కరణ



బ్రోచర్లను ఆవిష్కరిస్తున్న వై.ప్రవీణ్‌, జేసీఐ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్‌: శిల్పారామంలోని ఏపీ ఫంక్షన్‌ హాల్లో జూన్‌ 10, 11వ తేదీల్లో తిరుపతి జూనియర్‌ ఛాంబర్‌ ఆధ్వర్యంలో బిజినెస్‌ ఎక్స్‌పో–2023 నిర్వహించనున్నారు. జేసీఐ కార్యాలయంలో సోమవారం బ్రోచర్లను వై.ప్రవీణ్‌ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడు తూ రెండు రోజులు నిర్వహించే ఎక్స్‌పో–2023 లో వ్యాపారులు తమ ఉత్పత్తులు, సేవలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు. జేసీఐ అధ్యక్షుడు గుణశేఖర్‌ మాట్లాడుతూ ఈ బిజినెస్‌ ఎక్స్‌పోలో రియల్‌ ఎస్టేట్‌, కన్‌స్ట్రక్షన్‌, ఆటో మొబైల్‌, హాస్పిటల్‌, వస్త్ర, ఆహార, బ్యాంకింగ్‌, అలంకార, ఇతర రంగాలకు చెందిన 81 స్టాల్స్‌ను అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. జేసీఐ ప్రతినిధులు వైఎస్‌.బాబు, జి.శంకర్‌, దొరస్వామిరాజు, టీవై. చైతన్య, వినయ్‌, నామా రాజేష్‌ పాల్గొన్నారు.

పర్యావరణాన్ని కాపాడుదాం



ర్యాలీ చేస్తున్న అటవీశాఖాధికారులు

చంద్రగిరి(తిరుపతి రూరల్‌): పర్యావరణాన్ని కాపాడుదాం...ప్లాస్టిక్‌ను నిషేధిద్దాం అని అటవీశాఖ అధికారులు పిలుపునిచ్చారు. వారు సోమవారం ఏ.రంగంపేటలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రధాన కూడలి, రోడ్ల వెంట ఉన్న దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్‌ రహిత గ్రామంగా రంగంపేటను తీర్చిదిద్దేందుకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. అడవికి అనుకుని ఉన్న రంగంపేట గ్రామం నుంచి వచ్చే వ్యర్థాలు, ప్లాస్టిక్‌ వల్ల అటవీ జంతువులకు పెను ప్రమాదం జరిగే అవకాశం ఉందని, ప్లాస్టిక్‌ను పూర్తిగా తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఆర్వో చక్రపాణి, ఎఫ్‌బీఓ రవి, రెడ్డెప్ప, సిబ్బంది పాల్గొన్నారు.

వాకర్స్‌ శ్రమదానం



చంద్రగిరి(తిరుపతి రూరల్‌): వాకర్స్‌ అసోసియేషన్‌ సభ్యులు సోమవారం చంద్రగిరి బాలుర ప్రభుత్వ పాఠశాల క్రీడా మైదానంలో శ్రమదానం చేశారు. వాకింగ్‌ ట్రాక్‌తో పాటు మైదానంలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. సామాజిక కార్యక్రమాల్లో వాకర్స్‌ ముందుంటారని అసోసియేషన్‌ అధ్యక్షుడు పరంధామ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సుబ్రహ్మణ్యం రెడ్డి, బాలాజీ, రఘు, తులసి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని నిరసన

తిరుపతి తుడా: తిరుపతి రుయా ఆసుపత్రిలో స్టాఫ్‌ నర్సులు, నాలుగో తరగతి ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్‌ చేశారు. వారు సోమవారం పరిపాలన భవనం వద్ద నిరసన తెలిపారు. ఇదివరకే రుయా పరిపాలన అధికారి డాక్టర్‌ నాగమునీంద్రుడుకు వినతి పత్రమిచ్చినా పట్టించుకోలేదని ఏపీ ఎన్జీవో ఉపాధ్యక్షుడు నైనార్‌ వరప్రసాద్‌, ఏపీ హంస జిల్లా అధ్యక్షుడు రాజా వాపోయారు. స్టాఫ్‌ నర్సులకు అధిక పని భారం, సెలవుల మంజూరులో నిర్లక్ష్యంపై పలు మార్లు విన్నవించామన్నారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో పరిపాలన అధికారి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తామన్నారు.

11 నుంచి భరతనాట్యంలో శిక్షణ

తిరుపతి కల్చరల్‌: బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవన్‌లో 11వ తేదీ నుంచి ఉచితంగా భరత నాట్యంలో శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ ప్రజానాట్య మండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్నం పెంచలయ్య తెలిపారు. శిక్షణ పొందాలనుకునే వారు భరత నాట్య గురువు స్వప్నను 8500165615లో సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. సెలవుల్లో విద్యార్థులు సమయం వృథా చేసుకోకుండా, టీవీలు, సెల్‌ఫోన్లు చూస్తూ అనారోగ్యం పాలు కాకుండా నాట్యం నేర్చుకోవాలని సూచించారు.

అభివృద్ధి పనులకు స్టాండింగ్‌ కమిటీ ఆమోదం



అభివృద్ధి పనులపై చర్చిస్తున్న మేయర్‌, కమిషనర్‌, డిప్యూటీ మేయర్లు

తిరుపతి తుడా: నగరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు మున్సిపల్‌ కార్పొరేషన్‌ స్టాండింగ్‌ కమిటీ ఆమోదం తెలిపినట్లు మేయర్‌ శిరీష, కమిషనర్‌ హరిత తెలిపారు. మున్సిపల్‌ కార్పొరేషన్‌ కార్యాలయంలో సోమవారం సాయంత్రం స్టాండింగ్‌ కమిటీ సమావేశం నిర్వహించారు. ఇందులో మేయర్‌ శిరీష, కమిషనర్‌ హరిత, స్టాండింగ్‌ కమిటీ సభ్యులు, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్‌ రెడ్డి, ముద్రనారాయణ, ఎస్‌.కె.బాబు, నరసింహాచారి, ఉమాఅజయ్‌ పాల్గొన్నారు.
ఈ సందర్భంగా ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులకు స్టాండింగ్‌ కమిటీ ప్రతిపాదనలు చేసింది. అనంతరం వీటిని ఆమోదించి కౌన్సిల్‌కు సిఫార్సు చేసింది. మునిసిపల్‌ కార్పొరేషన్‌ అవుట్‌ డోర్‌ సిబ్బంది పర్యవేక్షణ కోసం వైర్‌ లెస్‌ సెట్ల కొనుగోలు, 50 డివిజన్లలో చెత్తను తరలించే వీల్‌ బారోస్‌ కొనుగోలుకు ఆమోదం తెలిపింది. 22వ డివిజన్‌లో రెండు చోట్ల ప్రస్తుతం వున్న రహదారిని 80 అడుగులకు విస్తరించడం, అదే డివిజన్‌లో 80 అడుగుల రోడ్డులో సెంటర్‌ మీడియన్‌ నిర్మాణం, పచ్చదనం పెంపు, సెంటర్‌ లైటింగ్‌ ఏర్పాటుకు అంగీకారం తెలిపింది. సమావేశంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరేంద్రనాథ్‌, మునిరామిరెడ్డి, అదనపు కమిషనర్‌ సునీత, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్‌ శ్రీలేఖ, ఎస్‌ఈ మోహన్‌, ఉప కమిషనర్‌ చంద్రమౌళీశ్వర్‌ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టౌన్‌ బ్యాంక్‌ అభివృద్ధే లక్ష్యం

- ఓవర్‌ డ్యూలు రూ.30 కోట్లు, బకాయిలు రూ.5 కోట్లు వసూలు
- తక్కువ వడ్డీతో కొత్త రుణాలకు ప్రణాళిక
- ఈ నెల 30 తేదీలోపు బ్యాంకు ఏటీఎం ప్రారంభం
- టౌన్‌ బ్యాంక్‌ ఛైర్మన్‌ కేతం జయచంద్రారెడ్డి వెల్లడి



మాట్లాడుతున్న టౌన్‌ బ్యాంక్‌ ఛైర్మన్‌ కేతం జయచంద్రారెడ్డి, హాజరైన బ్యాంక్‌ డైరెక్టర్లు

తిరుపతి కల్చరల్‌: తిరుపతి కో ఆపరేటివ్‌ బ్యాంక్‌ (టౌన్‌ బ్యాంక్‌)అభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తున్నామని ఛైర్మన్‌ కేతం జయచంద్రారెడ్డి తెలిపారు. ఆయన సోమవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. గతంలోనున్న బ్యాంక్‌ గ్రాస్‌ ఎన్‌పీఏ 23.69 శాతాన్ని 12.33 శాతానికి తగ్గించామన్నారు. రూ.56 కోట్లు ఉన్న బ్యాంక్‌ ఓవర్‌ డ్యూలలో రూ.30 కోట్లు వసూలు చేశామన్నారు. రూ.5 కోట్ల మొండి బకాయిలను సైతం వసూలు చేశామని తెలిపారు. ఈ నెల 1వ తేదీ నుంచి వేలం ప్రక్రియ ప్రారంభించామని, రుణాలు కట్టని వారికి వేలం నోటీసులను కూడా ఇస్తున్నట్లు గుర్తుచేశారు. ఖాతాదారుల సౌకర్యం కోసం ఈనెల 30వ తేదీలోపు బ్యాంక్‌ ఆవరణలో ఏటీఎంను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ద్విచక్ర, త్రిచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, గృహాల కొనుగోలు, గృహ నిర్మాణాలకు అతి తక్కువ వడ్డీతో రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. సమావేశంలో టౌన్‌ బ్యాంక్‌ వైస్‌ ఛైర్మన్‌ వాసు యాదవ్‌, డైరెక్టర్లు మబ్బు నాదమునిరెడ్డి, అమరనాథ్‌రెడ్డి, వెంకటేష్‌ రాయల్‌, మాకం చంద్ర, అనిల్‌ రాయల్‌, మహ్మద్‌ ఖాసీం (చోటాబాయ్‌), సురేష్‌కుమార్‌, బ్రహ్మానందరెడ్డి, జ్యోతిప్రకాష్‌ పాల్గొన్నారు.

12న గంగమ్మకు సారె

తిరుపతి గ్రామ దేవత తాతయ్యగుంట గంగమ్మ జాతరలో భాగంగా 12న టౌన్‌ బ్యాంక్‌ తరపున సారె సమర్పించనున్నట్లు బ్యాంక్‌ వైస్‌ ఛైర్మన్‌ వాసు యాదవ్‌ తెలిపారు. కార్యక్రమంలో బ్యాంక్‌ పాలక మండలి, బ్యాంక్‌ సిబ్బంది, ఖాతాదారులందరూ పాల్గొనాలని కోరారు.

ఎమ్మెల్యే చెవిరెడ్డిని విమర్శించే అర్హత జనసేన నేతలకు లేదు

తిరుపతి కల్చరల్‌: చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డిని విమర్శించే అర్హత జనసేన నేతలకు లేదని తిరుపతి స్థానిక హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు డీఎంసీ.భాస్కర్‌ ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యేగా ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవా కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు. ఆయనపై అవినీతి ఆరోపణలు చేయడం తగదన్నారు. విమర్శలు మానకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు.

10 నుంచి కల్యాణ వెంకన్న వార్షిక వసంతోత్సవాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్‌): శ్రీనివాసమంగాపురంలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక వసంతోత్సవాలు 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్నారు. 11వ తేదీ సాయంత్రం స్వర్ణ రథంపై శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వర స్వామి ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తారు. అలాగే స్వామి, అమ్మవార్ల ఉత్సవలకు ప్రతి రోజూ మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4 గంటల వరకు స్నపన తిరుమంజనం, సాయంత్రం ఊంజల్‌ సేవ, వీధి ఉత్సవం నిర్వహిస్తారు. తొలి రెండు రోజులు శ్రీవారు ఉభయనాంచారులతో కలిసి వసంతోత్సవంలో పాల్గొంటారు. చివరి రోజు శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి, శ్రీ సీతాలక్ష్మణ ఆంజనేయస్వామి సమేత శ్రీరామచంద్రమూర్తి, శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీకృష్ణ స్వామి ఉత్సవమూర్తులను వేంచేపుగా తీసుకొచ్చి శాస్త్రోక్తంగా స్నపన తిరుమంజనం, ఆస్థానం నిర్వహిస్తారు. వసంత రుతువులో లభించే పుష్పాలు, ఫలాలను సమర్పించి స్వామివారి దివ్యానుగ్రహం పొందడమే ఈ వసంతోత్సవం అంతరార్థం అని అర్చకులు తెలిపారు.

గ్రంథాలయాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న మస్తానమ్మ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సర్పంచ్‌ రూప

తిరుపతి అర్బన్‌: తిరుపతిలోని ప్రభుత్వ ప్రాంతీయ గ్రంథాలయంలో ఏర్పాటుచేసిన వేసవి ఉచిత శిక్షణ శిబిరాన్ని ఏపీ తెలుగు అధికార బాష సంఘం సభ్యురాలు మస్తానమ్మ ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు ఆనంద కుమార్‌, శ్రీసత్య సి ట్రస్ట్‌ ప్రతినిధి మహాలక్ష్మి, తిరుపతి ప్రాంతీయ గ్రంథాలయాధికారి వి.సూర్యనారాయణ మూర్తి పాల్గొన్నారు. అదేవిధంగా తిరుపతిలోని అన్నమయ్య సర్కిల్‌ సమీపంలోని గ్రంథాలయంలో గ్రంథాలయ జిల్లా ఛైర్మన్‌ నైనర్‌ మధుబాల శిబిరాన్ని ప్రారంభించారు.

పుస్తకాలే మన నేస్తాలు

చంద్రగిరి(తిరుపతి రూరల్‌): వేసవి సెలవుల్లో పుస్తకాలను నేస్తాలుగా చేసుకుని క్రమశిక్షణతో చదువుకోవాలని చంద్రగిరి సర్పంచ్‌ రూప అన్నారు. చంద్రగిరి గ్రంథాలయంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరాన్ని ప్రారంభించారు.

ప్రమాదాల నివారణపై దృష్టి



సిబ్బందితో మాట్లాడుతున్న డీఎస్పీ యశ్వంత్‌

తిరుపతి రూరల్‌: పూతలపట్టు–నాయుడుపేట జాతీయ రహదారి, భాకరాపేట ఘాట్‌ రోడ్‌లో జరుగుతున్న ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి సారించాలని చంద్రగిరి డీఎస్పీ టీడీ యశ్వంత్‌ ఆదేశించారు. ఆయన సోమవారం చంద్రగిరి పోలీస్‌ స్టేషన్‌ను తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోడ్డు ప్రమాదాలు, ప్రాణనష్టంపై ఆరా తీశారు. బ్లాక్‌ స్పాట్‌లను గుర్తించి, నష్ట నివారణ చర్యలు తీసుకోవాలన్నారు. స్టేషన్‌ పరిధిలో ఉన్న రౌడీషీటర్లు, నేరప్రవృత్తి గల వారిపై పర్యవేక్షణ చేపట్టాలని ఆదేశించారు. విధి నిర్వాహణలో నిర్లక్ష్యంగా ఉంటే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. చంద్రగిరి సీఐ ఓబులేశు, ఎస్‌ఐలు వంశీధర్‌, హిమబిందు పాల్గొన్నారు.

గంగమ్మను దర్శించుకున్న మేయర్‌, డెప్యూటీ మేయర్‌



పసుపు కొమ్ములు అందజేస్తున్న దాతలు

తిరుపతి కల్చరల్‌: తాతయ్యగుంట గంగమ్మను సోమవారం మేయర్‌ శిరీష, డెప్యూటీ మేయర్‌ భూమన అభినయ్‌రెడ్డి వేర్వేరుగా దర్శించుకున్నారు. అనంతరం జాతర ఏర్పాట్లను పరిశీలించారు. జాతరలో భక్తుల సౌకర్యార్థం చేపట్టనున్న ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని ఆలయ ఛైర్మన్‌, ఈవోలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఛైర్మన్‌ కట్టా గోపియాదవ్‌, ఈవో ఎం.మునిక్రిష్ణయ్య, ఆలయ ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

అమ్మవారికి 50 కిలోల పసుపు కొమ్ములు వితరణ

తాతయ్యగుంట గంగమ్మకు కోడూరు టి.కమ్మపల్లికి చెందిన నాగేశ్వరరావు దంపతులు సోమవారం 50 కిలోల పసుపు కొమ్ములు వితరణ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ గ్రీవెన్స్‌ సెల్‌ అధ్యక్షుడు ఉదయగిరి రమేష్‌, మురళి పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం



తిరుపతి రూరల్‌: తిరుపతి రూరల్‌ తహసీల్దార్‌గా బాధ్యతలు స్వీకరించిన టీవీ సుబ్రమణ్యంను సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు సత్కరించారు. మండల ప్రజలకు పారదర్శకంగా, వేగవంతమైన సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కొత్తపాటి మునీశ్వర్‌రెడ్డి, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఉపేంద్రరెడ్డి, రూరల్‌ వైస్‌ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, మూలం చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

రుయాలో మెరుగైన పారిశుద్ధ్యం



మాట్లాడుతున్న సీఎస్‌ఆర్‌ఎమ్‌ఓ డాక్టర్‌ లక్ష్మానాయక్‌

సాక్షి ఎఫెక్ట్‌..

తిరుపతి తుడా: రుయాలో మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టాలని సీఎస్‌ఆర్‌ఎమ్‌ఓ డాక్టర్‌ లక్ష్మానాయక్‌ ఆదేశించారు. తిరుపతి రుయా ఆసుపత్రిలో పారిశుద్ధ్య లోపంపై 'పారిశుద్ధ్యం దారుణమయా' అన్న శీర్షికన సాక్షి దిన పత్రికలో ప్రచురితమైన కథనంపై కలెక్టర్‌ వెంకటరమణారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో సీఎస్‌ఆర్‌ఎమ్‌ఓ లక్ష్మానాయక్‌ సోమవారం హెల్త్‌ సూపర్‌వైజర్‌, కాంట్రాక్టర్‌ ప్రతినిధులు, పర్యవేక్షకులతో సమావేశమయ్యారు. కాంట్రాక్ట్‌ నిబంధనల మేరకు పారిశుద్ధ్య సిబ్బందితో పూర్తిస్థాయిలో పనులు చేయించాలని ఆదేశించారు. సిబ్బంది విధులపై నిఘా పెడతామన్నారు. బయో వేస్ట్‌ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే కాంట్రాక్టర్‌ రద్దు కోసం ప్రభుత్వానికి సిఫార్సు చేస్తామని హెచ్చరించారు. హెల్త్‌ సూపర్‌వైజర్‌ ప్రకాష్‌ పాల్గొన్నారు.

తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలి

తిరుపతి రూరల్‌: దామినేడు సర్వే నంబర్‌ 38/3, 40/2లో తప్పుడు పత్రాలు సృష్టించిన వారిపై చర్యలు తీసుకోవాలని, రిజిస్ట్రేషన్‌ అయిన భూములకు మ్యుటేషన్‌ చేసి ఆన్‌లైన్‌లో ఉంచాలని సీపీఐ(ఎంఎల్‌) న్యూడెమొక్రసీ తిరుపతి నగర కార్యదర్శి వెంకటరత్నం డిమాండ్‌ చేశారు. ఆయన సోమవారం బాధితులతో కలిసి తిరుపతి రూరల్‌ తహసీల్దార్‌ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. దామినేడులో వేసిన లేఅవుట్‌లో 68 ప్లాట్లు రిజిస్ట్రేషన్‌ అయ్యాయన్నారు. చాలామంది ఇళ్లు నిర్మించుకుని 15 ఏళ్లుగా నివాసం ఉంటున్నారని తెలిపారు. ఇటీవల కొందరు రెవెన్యూ అధికారులతో కలిసి తప్పుడు రికార్డులు సృష్టించి దౌర్జన్యానికి పాల్పడుతున్నారని పేర్కొన్నారు. న్యాయం చేయాలని కోరారు. విచారించి న్యాయం చేస్తామని తహసీల్దార్‌ టీవీ సుబ్రమణ్యం వారికి హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే పెళ్లి కానుక పంపిణీ



పాకాలలో పెళ్లి కానుక అందజేస్తున్న నేతలు



చంద్రగిరిలో..

పాకాల/చంద్రగిరి(తిరుపతి రూరల్‌) : పాకాల మండలం ఉప్పరపల్లి పంచాయతీకి చెందిన లక్ష్మీకుమారి, జ్యోతినాథ్‌, చంద్రగిరి భారత్‌ నగర్‌కు చెందిన పూజితకు, కర్ణాటక రాష్ట్రం చిక్‌ బళాపూర్‌కు చెందిన అనంతకు పెళ్లి కుదిరింది. వారికి చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి పెళ్లి కానుక పంపించారు. వాటిని సోమవారం వైఎస్సార్‌సీపీ నాయకులు అందజేశారు. ఉప్పరపల్లి సర్పంచ్‌ గౌరీశంకర్‌రాజు, దామలచెరువు డివిజన్‌ అధ్యక్షుడు భాస్కర్‌నాయుడు, ఎంపీటీసీ సురేష్‌, పంచాయతీ అధ్యక్షుడు నాగూర్‌బాషా, చంద్రగిరి డివిజన్‌ అధ్యక్షుడు కుప్పిరెడ్డి భాస్కర్‌ రెడ్డి, మార్కెట్‌ యార్డు మాజీ ఛైర్మన్‌ మస్తాన్‌, సర్పంచ్‌ రూప, కోలా అనిల్‌ పాల్గొన్నారు.

తిరుమల శ్రీవారి సేవలో ప్రముఖులు





నటుడు అల్లరి నరేష్‌, హీరోయిన్‌ మీరానా మీనన్‌, దర్శకుడు విజయ్‌ కనకమేడల, సినీ రైటర్‌ రామ జోగయ్య శాస్త్రి

తిరుమల: శ్రీవారిని సోమవారం సినీ నటుడు అల్లరి నరేష్‌, హీరోయిన్‌ మీరానా మీనన్‌, దర్శకుడు విజయ్‌ కనకమేడల, సినీ రైటర్‌ రామజోగయ్య శాస్త్రి, ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనం అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు ప్రసాదాలతో సత్కరించారు.

12న చంద్రగిరి మండల సమావేశం

చంద్రగిరి(తిరుపతి రూరల్‌): చంద్రగిరి మండల సాధారణ సర్వసభ్య సమావేశం 12న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో రమేష్‌బాబు తెలిపారు. ఎంపీపీ హేమేంద్రకుమార్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి చిత్తూరు ఎంపీ రెడ్డెప్ప, చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి హాజరవుతారని పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని సూచించారు.

రామ్మూర్తికి ఎమ్మెల్యే భూమన నివాళి



రామ్మూర్తి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి

తిరుపతి మంగళం : తిరుపతి కార్పొరేషన్‌ పరిధి లోని శెట్టిపల్లి గ్రామం వైఎస్సార్‌సీపీ వార్డు మెంబర్‌ రామ్మూర్తి ఆదివారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే భూ మన కరుణాకరరెడ్డి, డిప్యూటీ మేయర్‌ భూమన అభినయ్‌ రెడ్డి సోమవారం శెట్టిపల్లిలోని మృతుడు రామ్మూర్తి నివాసానికి వెళ్లారు. మృతదేహంపై పూ లమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. రామ్మూర్తి లేనిలోటు పార్టీకి తీరనిలోటని తెలిపారు. శెట్టిపల్లి డివిజన్‌ అధ్యక్షుడు బత్తిన బాబు, పార్టీ నాయకులు రామకృష్ణ, మునిబాబు, చంద్ర, గంగు, రమేష్‌ పాల్గొన్నారు.

బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఈఓ శేఖర్‌

పాకాల : మండలంలోని బడి ఈడు పిల్లలు బడిలోనే ఉండాలని డీఈఓ శేఖర్‌ తెలిపారు. ఆయన సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో హెచ్‌ఎంలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్‌రోల్‌మెంట్‌ డ్రైవ్‌ను చేపట్టిందన్నారు. ఈ నెల 12, 13వ తేదీల్లో ప్రిన్సిపల్‌ సెక్రటరీ పాఠశాలలను తనిఖీ చేయనున్నారని తెలిపారు. ఈ క్రమంలో పాఠశాల రిజిస్టర్లు, రికార్డులు పూర్తి చేసుకోవాలని గుర్తు చేశారు. విద్యార్థుల పరీక్షల ఫలితాలు విద్యార్థుల తల్లిదండ్రులకు తెలపాలన్నారు. జగనన్న విద్యాకానుక ప్రతి విద్యార్థికి అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. నాడు–నేడు పనులు వేగవంతం చేయాలని, 10వ తరగతిలో ఫెయిల్‌ అయిన విద్యార్థులకు రెమిడియల్‌ తరగతులు నిర్వహించాలని సూచించారు. మండలంలో నిర్వహిస్తున్న మెడికెల్‌ క్యాంపును ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి ఉపయోగించుకునేలా చూడాలని తెలిపారు. ఎంఈఓ బాబ్జీ, పాల్గొన్నారు.

దాస్యభక్తికి ప్రతీక హనుమంతుడు



మాట్లాడుతున్న ఆచార్య కె.సర్వోత్తమరావు

తిరుపతి కల్చరల్‌: నవవిధ భక్తి మార్గాల్లో ఒకటైన దాస్య భక్తికి ప్రతీక హనుమంతుడని ఎస్వీయూ విశ్రాంత తెలుగు ఆచార్యులు కె.సర్వోత్తమరావు తెలిపారు. అన్నమాచార్య కళామందిరంలో నిర్వహిస్తున్న తాళ్లపాక అన్నమయ్య జయంతి ఉత్సవాలు సోమవారం మూడో రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా నిర్వహించిన సాహితీ సదస్సులో ఆయన అన్నమయ్య– హనుమత్‌ కీర్తనలు అనే అంశంపై ప్రసంగించారు. శ్రీవారి అవతారమైన శ్రీరాముడు –హనుమంతుడి మధ్య దాస్య భక్తిని, శరణాగతిని తెలియజేస్తూ అన్నమయ్య పలు సంకీర్తనలు రచించారని తెలిపారు. జాతీయ సంస్కృత వర్సిటీ తెలుగు ఆచార్యులు నల్లన్న అన్నమయ్య–గ్రామీణ జీవనం అనే అంశంపై మాట్లాడుతూ అన్నమయ్య తన సంకీర్తనల్లో గ్రామీణ జీవితంలోని మాధుర్యాన్ని, జానపదాలను, గ్రామాల్లోని సామెతలను, నానుడులను పొందుపరిచారని తెలిపారు. జాతీయ సంస్కృత వర్సిటీ సహాయ ఆచార్యుడు గంగిశెట్టి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ అన్నమయ్య –పౌరాణికత అనే అంశంపై ప్రసంగించారు. సాయంత్రం తిరుపతికి చెందిన ఆర్‌.బుల్లెమ్మ బృందం ప్రదర్శించిన సంగీత సభ, సీతాలక్ష్మి బృందం హరికథాగానం ఆకట్టుకున్నాయి. అన్నమాచార్య ప్రాజెక్టు సంచాలకుడు డాక్టర్‌ ఆకెళ్ల విభీషణ శర్మ పాల్గొన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్‌పై ఫిర్యాదు



కమిషనర్‌ హరితకు ఫిర్యాదు చేస్తున్న కల్పన

తిరుపతి తుడా: తిరుపతి మున్సిపల్‌ కార్పొరేషన్‌ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ పి.నాగులుపై కల్పన అనే మహిళ ఫిర్యాదు చేసింది. మేయర్‌ శిరీష, కమిషనర్‌ హరిత, డిప్యూటీ మేయర్‌ ముద్ర నారాయణలు సోమవారం స్పందనలో ఫిర్యాదులు స్వీకరించారు. కాయంపేటకు చెందిన కల్పన మాట్లాడుతూ తన అమ్మ ఆదిలక్ష్మి కార్పొరేషన్‌లో మేస్త్రీగా పనిచేస్తోందని తెలిపారు. 29వ డివిజన్‌ శానిటరీ ఇన్‌స్పెక్టర్‌ పి.నాగులు ఆమెను బెదిరించి 16 ఏళ్లుగా బ్యాంకు పాస్‌ బుక్‌, ఏటీఎం కార్డులను తన వద్ద ఉంచుకున్నాడని తెలిపింది. న్యాయం చేయాలని కోరింది. మధురానగర్‌లో మురుగు కాలువ పొంగి నీరు రోడ్డుపై ప్రవహిస్తోందని, నారాయణపురంలో రోడ్డుపై ప్రహరీ గోడను అక్రమంగా నిర్మించారని, జీవకోన సాయినగర్‌లో ఓవర్‌ హెడ్‌ ట్యాంక్‌ శిథిలావస్థకు చేరిందని స్థానికులు పేర్కొన్నారు. అనంతరం మేయర్‌ శిరీష, కమిషనర్‌ హరిత అధికారులతో సమావేశమయ్యారు. స్పందన ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు కమిషనర్‌ సునీత, డిప్యూటీ కమిషనర్‌ చంద్రమౌళీశ్వర రెడ్డి, ఎస్‌ఈ మోహన్‌, హెల్త్‌ ఆఫీసర్‌ హరికృష్ణ, మున్సిపల్‌ ఇంజినీర్లు చంద్రశేఖర్‌, వెంకటరామిరెడ్డి పాల్గొన్నారు.

కేసుల పరిష్కారానికి సహకరించండి



సమావేశంలో ప్రసంగిస్తున్న జడ్జి వీర్రాజు

తిరుపతి లీగల్‌ : కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని నూతన న్యాయమూర్తులు కోరారు. వారు సోమవారం న్యాయవాదుల అసోసియేషన్‌ హాలులో న్యాయవాదుల సంఘం పరిచయ సమావేశాన్ని ఏర్పాటుచేశారు. ఇందులో 3వ అదనపు జిల్లా జడ్జి వై.వీర్రాజు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. తిరుపతి ప్రిన్సిపల్‌ సీనియర్‌ సివిల్‌ జడ్జి డి.విజయసారథిరాజు, అదనపు సీనియర్‌ సివిల్‌ జడ్జి ఎ.సునీతారాణి, ప్రిన్సిపల్‌ జూనియర్‌ సివిల్‌ జడ్జి బి.వాణిశ్రీ, మొదటి అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి సత్యనారాయణ మూర్తి, 3వ అదనపు జూనియర్‌ సివిల్‌ జడ్జి ఎం.సంధ్యారాణి, రాష్ట్ర ఎర్రచందనం కేసుల విచారణ జూనియర్‌ సివిల్‌ జడ్జి ఎస్‌.శ్రీకాంత్‌ మాట్లాడుతూ కేసుల పరిష్కారంలో న్యాయవాదులు తమకు సహకరించాలని కోరారు. తిరుపతి న్యాయవాదుల అసోసియేషన్‌ అధ్యక్షుడు వెంకట్‌కుమార్‌, ఉపాధ్యక్షుడు గోపీచంద్‌, ప్రధాన కార్యదర్శి మురళి తదితరులు పాల్గొన్నారు.

3వ ఏడీజేగా గురునాథ్‌

తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జిగా (ఏడీజే)గా ఎం.గురునాథ్‌ను నియమిస్తూ రాష్ట్ర హైకోర్టు సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. జడ్జి గురునాథ్‌ ప్రస్తుతం రాష్ట్ర హైకోర్టు న్యాయసేవా సంస్థ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ప్రస్తుతం 3వ అదనపు జిల్లా జడ్జిగా ఉన్న వై.వీర్రాజు టీటీడీ లా ఆఫీసర్‌గా బదిలీ అయిన విషయం తెలిసిందే.